ఒత్తిడిని జయిస్తేనే విజయం సాధ్యం



విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లను అందజేస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

మల్లాపూర్: పదోతరగతి విద్యార్థులు ఒత్తిడిని జయిస్తేనే విజయం సాధించవచ్చని, ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. నాచారం డివిజన్ పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన 508 పదోతరగతి విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్‌లు, పెన్నులు పరీక్ష సామగ్రిని సోమవారం ఇందిరా స్కూల్‌లో అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. 'పది' పరీక్షలను ప్రశాంతంగా రాయాలని సూచించారు. బీఆర్ఎస్ గ్రేటర్ సీనియర్ నేత సాయిజెన్‌శేఖర్ తదితరులున్నారు.

'సైన్స్ ఫెయిర్'తో మానసిక వికాసం



మౌలాలి: విద్యార్థుల్లో మానసిక వికాసాన్ని పెంపొందించేందుకు 'సైన్స్ ఫెయిర్స్' ఉపయోగపడతాయని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. సోమవారం మౌలాలి డివిజన్ శ్రామికనగర్‌లోని ఈడెన్ హైస్కూల్‌లో నిర్వహించిన సైన్స్‌ఫెయిర్‌కు ఆయన హాజరై మాట్లాడారు. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకత వీటితోనే వెలుగులోకి వస్తుందన్నారు. అనంతరం పాఠశాల నిర్వాహకులను ఆయన ఘనంగా సన్మానించారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



గాంధీనగర్‌లో పాదయాత్ర చేస్తున్న కార్పొరేటర్ స్వర్ణరాజ్ శివమణి

కాప్రా: ప్రజా సమస్యలు తెలుసుకునేందుకు కార్పొరేటర్ స్వర్ణరాజ్ శివమణి గాంధీనగర్‌లో పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా స్థానికులు వారి సమస్యలను కార్పొరేటర్‌కు వివరించారు. పవర్‌బోర్, వాటర్‌ట్యాంక్, పబ్లిక్ నల్లాల మరమ్మతులు, సీసీరోడ్ల నిర్మాణం, డ్రైనేజీ తదితర సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. తన దృష్టికి వచ్చిన సమస్యలను పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ నేతలు విఠల్‌నాయక్, సత్యనారాయణ, మల్లారెడ్డి, పవన్, అరుణ్ కిరణ్, హరి, మనోజ్, రాంచందర్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

పీర్జాదిగూడలో ఎంఈఓ కార్యాలయం ఏర్పాటు



తాత్కాలిక ఎంఈఓ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న డీసీఈబీ కార్యదర్శి సురేష్

మేడిపల్లి: పీర్జాదిగూడ జిల్లా పరిషత్ హైస్కూల్ ఆవరణలో మేడిపల్లి మండల విద్యాధికారి తాత్కాలిక కార్యాలయం ఏర్పాటైంది. సోమవారం డీసీఈబీ కార్యదర్శి సురేష్ ముఖ్యఅతిథిగా హాజరై ఎంఈఓ కార్యలయాన్ని ప్రారంభించారు. మేడిపల్లి మండల విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి, మేడిపల్లి, బోడుప్పల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు సత్యప్రసాద్, దామోదర్, మండల పరిధిలో పనిచేస్తున్న ప్రభుత్వ ఉపాధ్యాయులు, ప్రైవేట్ పాఠశాలల నిర్వాహకులు, కార్యాలయ సిబ్బంది, ఎంఐఎస్, సీఆర్‌పీలు తదితరులున్నారు.

'పది' విద్యార్థులకు వీడ్కోలు



బోడుప్పల్: బృందావన్ కాలనీలోని జేజీఆర్ ఉన్నత పాఠశాలలో చదివే పదోతరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా స్కూల్ కరస్పాండెంట్ గంగరాజు మాట్లాడుతూ.. నర్సరీ నుంచి ఇక్కడే చదువుకుని వెళ్తున్న విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత స్థాయిలో ఉండాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. విజయకుమారి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పరీక్షల సమయం.. వద్దు భయం



విద్యార్థినులకు సూచనలు ఇస్తున్న కలెక్టర్ గౌతమ్ (ఫైల్)



పరీక్షలు రాస్తున్న విద్యార్థులు (ఫైల్)

మేడ్చల్‌రూరల్: ప్రతి విద్యార్థి జీవితంలో పదోతరగతి తొలిమెట్టు. మొట్ట మొదటిసారిగా వార్షిక పరీక్షలను ఎదుర్కొంటున్న విద్యార్థులకు ఎంతో ఆందోళన ఉంటుంది. తమ పిల్లలు ఎలా పరీక్షలు రాస్తారని, మరోవైపు తల్లిదండ్రులు సైతం గాబరా పడుతుంటారు. దీనితో పాటు తమ పిల్లలు బాగా చదివి మంచి గ్రేడ్‌లతో ఉత్తీర్ణత సాధించాలని పరితపిస్తుంటారు. మార్చి 21 నుంచి ఏప్రిల్ 4 వరకు ఈ వార్షిక పరీక్షలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో పదోతరగతి విద్యార్థుల కోసం సాక్షి అందిస్తున్న ప్రత్యేక కథనం.

విద్యార్థులు పాటించాల్సినవి...

- పరీక్షలు వస్తున్నాయనే భయంతో అదే పనిగా చదవడం మంచిది కాదు. బట్టీ పట్టి చదవకుండా ప్రతీ విషయాన్ని అర్థం చేసుకుంటూ చదవాలి.
- ఆహార పదార్థాల విషయంలో తొందరగా జీర్ణమయ్యే వాటిని తీసుకోవాలి. తరచూ నీళ్లు తాగుతూ ఉండాలి.
- చదివిన అంశాన్ని విశ్లేషించే సామర్థ్యాన్ని పెంపొందించుకోవాలి. కనీసం రోజుకు 8 గంటల సమయం తప్పకుండా నిద్రకు వెచ్చించాలి.

తల్లిదండ్రులకు సూచనలు..

- పరీక్షలు దగ్గరపడున్నాయని, ఒకే పనిగా చదవమని విద్యార్థులను తల్లిదండ్రులు ఇబ్బంది పెట్టొద్దు.
- పిల్లలు చదువుతున్నప్పుడు వారికి ప్రశాంత వాతావరణాన్ని కల్పించాలి. సెల్‌ఫోన్లు, టీవీల నుంచి దూరంగా ఉండేలా చూసుకోవాలి.
- ఇతర విద్యార్థులకు ఎక్కువ మార్కులు వస్తున్నాయని, వారితో పోల్చుకుని ఒత్తిడికి గురిచేయకూడదు.

భయం వీడి... ప్రణాళికతో ముందుకు

భవిష్యత్తులో ముందుకు సాగాలంటే ప్రతీ విద్యార్థి విజయానికి ప్రణాళిక తప్పనిసరి. క్రమ పద్ధతిలో ముందుకు సాగితే అవలీలగా లక్ష్యాన్ని చేరుకోవచ్చు. తమ బలం, బలహీనతలను సరి చూసుకోవాల్సిన అవసరం ఉంది. ఒత్తిడిని అధిగమించి అనవసరమైన ఆందోళనకు గురై అనారోగ్యానికి గురికావొద్దు.

– రంగాచారి, మండల విద్యాధికారి

ఆందోళన పడకుండా ఇష్టపడి చదవాలి..

విద్యార్థులు తమ పరీక్షలు దగ్గరపడుతున్నాయనే ఆందోళన చెందకుండా చదువుతున్న విషయంపై ఇష్టం పెంచుకుని చదవడం ద్వారా తొందరగా అర్థమౌతుంది. మనస్సును ప్రశాంతంగా పెట్టుకుని చదవడం వల్ల పాఠ్యాంశం కూడా అర్థమౌతుంది. సమయపాలనతో ఇష్టపడి చదివితే అధిక మార్కులు సాధించవచ్చు.

– ప్రేమ్‌కుమార్, ఉపాధ్యాయుడు

ప్రశ్నాపత్రాన్ని అర్థం చేసుకోవాలి..

పరీక్షల సమయంలో ఇచ్చిన ప్రశ్నాపత్రాన్ని క్షుణ్ణంగా చదివి అర్థం చేసుకోవాలి. అప్పుడే సమాధానం రాయడం తేలిక అవుతుంది. చేతిరాత అందంగా ఉండేలా చూసుకోవాలి. అప్పుడే అధిక మార్కులు పొందవచ్చు. ఇచ్చిన ప్రశ్నకు ఎన్ని మార్కులు ఇచ్చారో గమనించి క్లుప్తంగా రాయాలి. బాగా తెలిసిన ప్రశ్నకు సమాధానాన్ని నెంబర్ వేసి ముందు రాసుకోవాలి. సామాన్యశాస్త్రంలో పట్టిక, ప్రయోగం, బొమ్మలు గీసిన అనంతరం వివరణ, విశ్లేషణ రాయడం వల్ల పూర్తి మార్కులు ఇస్తారు.

– బేబి, ఉపాధ్యాయురాలు

విద్యార్థులకు సాధన తప్పనిసరి

విద్యార్థులు గణితం, ఇంగ్లిష్ అంశాలు అంటేనే భయపడతారు. వారిలో భయం పోవాలంటే సూత్రాలను ఆధారం చేసుకుని గణితాన్ని సాధన చేయాలి. తెలుగు మీడియం విద్యార్థులు ఇంగ్లిష్‌లో మెలకువలు పాటిస్తూ ఇచ్చిన ప్రశ్నలను పదేపదే చదివి అర్థం చేసుకుని ఆ తర్వాత సమాధానం రాయాలి. కనీసం 8గంటల నిద్ర అవసరం. పరీక్షల హడావిడిలో పడి ఆహారం సరిగ్గా తీసుకోకుండా నిర్లక్ష్యం చేయడం మంచిది కాదు.

– రంగాచారి, ఎంఈఓ మేడ్చల్

డంపింగ్ యార్డు తరలింపుపై | కొనసాగుతున్న నిరసన



డంపింగ్‌యార్డు వద్ద కాలనీవాసులతో ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

అల్వాల్: కాలనీవాసులకు ఇబ్బంది కలిగిస్తున్న డంపింగ్‌యార్డును తరలించాలని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. మచ్చబొల్లారంలోని హిందూ శ్మశానవాటికలో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన డంపింగ్‌యార్డు వద్ద శాశ్వత నిర్మాణాలు చేపట్టడంపై కాలనీవాసులు అభ్యంతరం వ్యక్తం చేస్తూ రెండ్రోజులుగా ఆందోళన చేస్తున్నారు. సోమవారం డంపింగ్‌యార్డులోనే కూర్చొని ఎమ్మెల్యే ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రజారోగ్యం, హిందూ సాంప్రదాయాలను మనోభావాలను లెక్క చేయకుండా ఇష్టానుసారంగా అధికారులు వ్యవహరించడం సమంజసం కాదని, డంపింగ్‌యార్డులో పేరుకుపోయిన వ్యర్థాల కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఈ సమస్య పరిష్కారం అయ్యే వరకు ప్రతిరోజూ ధర్నా కొనసాగిస్తామని, అవసరమైతే అల్వాల్ జీహెచ్ఎంసీ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ సమస్యను సీఎం దృష్టికి కూడా తీసుకెళ్లి అవినీతి అధికారులపై చర్యలు తీసుకుంటామన్నారు. అల్వాల్ ఇన్‌స్పెక్టర్ రాహుల్ దేవ్ శాంతిభద్రతలను దగ్గరుండి పర్యవేక్షించారు. అల్వాల్ కార్పొరేటర్ శాంతిశ్రీనివాస్‌రెడ్డి, పేట్ బషీరాబాద్ ఏసీపీ రాములు, డీఐ తిమ్మప్ప, సిబ్బంది పాల్గొన్నారు. నాయకులు డోలి రమేష్, ఢిల్లీ పరమేష్, చరణ్, గిరి, శోభన్, ఉదయ్ ప్రకాష్, దిలీప్, సుధాకర్, ప్రశాంత్‌రెడ్డి, కరుణశ్రీ, హరిత తదితరులు పాల్గొన్నారు.

సాండ్ బజార్ పేరుతో ప్రభుత్వం మోసం !

రాష్ట్ర ఇసుక లారీ ఓనర్స్ అసోసియేషన్ ఆరోపణ

ఉప్పల్: రాష్ట్ర ప్రభుత్వం సాండ్ బజార్ పేరుతో ప్రజలు, ఇసుక వ్యాపారం మీద అధారపడిన కార్మికులను మోసం చేస్తోందని తెలంగాణ రాష్ట్ర ఇసుక లారీ ఓనర్స్ అసోసియేషన్ ఆరోపించింది. సోమవారం ఉప్పల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో రాష్ట్ర నాయకుడు రాజేందర్‌రెడ్డి, సూర్వీ యాదయ్యగౌడ్, రాజుగౌడ్‌లు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం కాంట్రాక్టర్లతో చేతులు కలిపి ప్రస్తుతం నడుస్తున్న ఇసుక పాలసీని దశలవారీగా కార్పొరేట్ సంస్థలకు అప్పజెప్పేందుకు కుట్రలు పన్నుతోందని విమర్శించారు. లోడింగ్‌ను వేగవంతం చేస్తే టన్నుకు రూ. 1500 నుంచి రూ.1600లకే వినియోగదారులకు ఇసుకను అందజేస్తామని హామీ ఇచ్చారు. పాసింగ్ విధానంతో ప్రభుత్వానికి వచ్చే ఆదాయం కేవలం 10 శాతమేనని, వినియోగదారులకు మాత్రం 90 శాతం భారం పడుతోందని స్పష్టం చేశారు. ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలతో గత 20 ఏళ్లుగా ఇసుక వ్యాపారంపైనే ఆధారపడి జీవిస్తున్న కుటుంబాలు వీధినపడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఉపసంహరించుకోవాలని, లేదంటే ఇసుక లారీ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన చేపడతామని హెచ్చరించారు. బోడుప్పల్ అధ్యక్షుడు మాధవరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, నర్రి వెంకన్న, జంగయ్యగౌడ్, బలవంత్ రెడ్డి, జగదీష్‌యాదవ్, రాజు, కృష్ణగౌడ్, అశోక్‌యాదవ్, శ్రీశైలం, సికిందర్ తదితరులున్నారు.



ఉప్పల్‌లో నిర్వహించిన సమావేశంలో ఇసుక లారీ ఓనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు

అమరవీరుల స్మారక ర్యాలీ



ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ర్యాలీ చేస్తున్న దృశ్యం

ఘట్‌కేసర్: అమరవీరులు భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌లను స్మరించుకుంటూ ఎస్ఎఫ్ఐ విద్యార్థుల ఆధ్వర్యంలో ఘట్‌కేసర్‌లో సోమవారం భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు అవినాష్, ప్రధాన కార్యదర్శి కార్తీక్ మాట్లాడుతూ.. మహనీయులను స్ఫూర్తిగా తీసుకుని విద్యార్థుల హక్కులు, నాణ్యమైన విద్య, అన్యాయానికి వ్యతిరేకంగా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శులు సుబ్బు, శ్యామ్, ఉపాధ్యక్షుడు శ్యామ్‌మండల్, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి అనిల్, మనోజ్, నాయకులు వినయ్, శ్రీరామ్, జితేందర్ పాల్గొన్నారు.

బీజేపీ ఉప్పల్ డివిజన్ అధ్యక్షుడిగా ఫణీందర్



ఉప్పల్: ఉప్పల్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడిగా మార్నేణి ఫణీందర్‌ను నియమిస్తూ ఆ పార్టీ జిల్లా ఎలక్షన్ అధికారి ఆచారి ప్రకటన విడుదల చేశారు. చిలుకానగర్ డివిజన్ అధ్యక్షుడిగా దత్త సాయిని నియమించారు. పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటామన్నారు. అవకాశం కల్పించిన పార్టీ పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు.


వ్యక్తి ఆత్మహత్య

కుషాయిగూడ: కుటుంబ సమస్యలతో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన కుషాయిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సుదర్శనం శేఖర్ అనే వ్యక్తి అల్యూమినియం ఫ్యాబ్రికేషన్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. ఇటీవల తన బంధువుల స్మారక కార్యక్రమానికి హాజరుకాగా.. భార్యతో మాటమాట పెరిగి గొడవకు దారితీసింది. దంపతుల మధ్య సయోధ్య కుదిర్చేందుకు పెద్దలు ప్రయత్నించారు. పెద్దల ప్రయత్నంలో అతడిలో ఎలాంటి మార్పు రాలేదని, గతంలో కూడా రెండుసార్లు ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు కుటుంబసభ్యులు పేర్కొన్నారు. ఆ తరువాత మద్యం మత్తులో కుటుంబసమస్యలతో గొడవపడి రూమ్‌లోకి వెళ్లిపోయాడు. మరుసటి రోజు ఉదయం చూసేసరికి ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని బంధువులు చెబుతున్నారు. కుటుంబ వివాదాలతోనే తన తండ్రి ఆత్మహత్యకు పాల్పడినట్లు కుమారుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేత

మేడ్చల్: అత్వెల్లి ప్రభుత్వ పాఠశాలలో పదోతరగతి విద్యార్థులకు బీజేపీ పట్టణ ప్రధాన కార్యదర్శి ప్రేమ్‌దాస్ ఇచ్చిన స్టడీ మెటీరియల్‌ను స్థానిక నాయకులు అందజేశారు. విద్యార్థులు పరీక్షలకు భయపడకుండా రాయాలని సూచించారు. బీజేపీ నాయకులు నందారెడ్డి, శైలజ, ఈశ్వర్, వంశీధర్‌రెడ్డి, మహేష్, బాబురాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మల్లన్న కల్యాణం



డోలు వాయిస్తున్న కాంగ్రెస్ నేతలు

మేడ్చల్: మున్సిపాలిటీలోని మల్లన్న ఆలయంలో స్వామివారి కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. సోమవారం జాతర మహోత్సవాలు, కల్యాణోత్సవం సంప్రదాయబద్ధంగా చేపట్టారు. మున్సిపల్ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని బోనాలు, మొక్కులు చెల్లించుకున్నారు. నిర్వాహకులు భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. డీసీసీ అధ్యక్షుడు హరివర్ధన్‌రెడ్డి, నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ వజ్రేష్‌యాదవ్ పాల్గొని డోలు వాయించి నాయకులను ఉత్సాహపరిచారు.

కార్పొరేటర్ పర్యటన

గౌతంనగర్: గౌతంనగర్ డివిజన్ ఇందిరానెహ్రూనగర్, ఈస్ట్ ఇందిరానెహ్రూనగర్ ప్రాంతాల్లో కార్పొరేటర్ మేకల సునీతారాముయాదవ్ సోమవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వేసవిని దృష్టిలో ఉంచుకుని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి ఆదేశాల మేరకు గౌతంనగర్ డివిజన్‌లో నీటి సమస్య నివారణకు తగిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. కాలనీలో పవన్ బోరుకు సొంత నిధులతో మరమ్మతులు చేయిస్తానని ఆమె హామీ ఇచ్చారు. నాయకులు మేకల రాముయాదవ్, భైరు అనీల్, సిద్ధి రాములు, నరహరిరావు, నగేష్‌గౌడ్, మల్లేష్ యాదవ్, శ్రీను, సూర్యప్రకాష్, శ్రీను, శశి, హబీబ్, పద్మ, శైలజ, లక్ష్మి తదితరులున్నారు.



కాలనీలో పర్యటిస్తున్న కార్పొరేటర్ సునీతారాముయాదవ్

పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలి



సీసీరోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి

మల్లాపూర్: సీసీరోడ్డు పనుల్లో నాణ్యత ప్రమాణాలను పాటించాలని మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం మల్లాపూర్ డివిజన్ పరిధిలోని నెహ్రూనగర్ మూడో బ్లాక్‌లో రూ. 1.20 కోట్లతో జరుగుతున్న సీసీరోడ్డు పనులను కార్పొరేటర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డ్రైనేజీ పైపు లైన్లు, మరమ్మతు పనులు, మ్యాన్‌హోల్స్ చాంబర్స్‌ను వెంటనే పూర్తి చేయాలని జలమండలి అధికారులను ఆదేశించారు. డీఈ రూప, ఏఈ స్రవంతి, వర్క్‌ఇన్‌స్పెక్టర్ రామారావు, బిక్షపతి, స్థానిక బీఆర్ఎస్ నేతలు భాస్కర్, భాసిత్‌ఖాన్, ప్రకాష్, శ్రీను, అంజి, రామాంజనేయులు, దీపక్‌సింగ్, ఎండీ ఉస్మాన్, రాపోలు శ్రీను తదితరులున్నారు.

వైద్యుల నిర్లక్ష్యం.. నవజాత శిశువు మృతి

అల్వాల్: వైద్యుల నిర్లక్ష్యం కారణంగా నవజాతశిశువు మృతిచెందిన ఘటన అల్వాల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మేడ్చల్‌కు చెందిన శ్రీకాంత్ రెడ్డి, బాబాగూడకు చెందిన సోనిరెడ్డితో గత ఆరేళ్ల క్రితం వివాహమైంది. సోని గర్భవతి కావడంతో ఆదివారం డెలివరీ కోసం అల్వాల్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. అయితే ఆమెకు నార్మల్ డెలివరీ కోసం రాత్రి వరకు ఆపరేషన్ చేయలేదు. శిశువు హార్ట్‌బీట్ తక్కువగా వస్తుందని వెంటనే ఆపరేషన్ (సీ–సెక్షన్) చేయాలని చెప్పి ఆపరేషన్ థియేటర్‌కు తీసుకెళ్లారని, అనంతరం శిశువు మృతి చెందిందని వైద్యులు చెప్పారని బంధువులు చెప్పారు. రోజూ ట్రీట్‌మెంట్ ఇచ్చిన డాక్టర్ కాకుండా మరొకరు డెలివరీ చేయడం, సదరు డాక్టర్ నిర్లక్ష్యం కారణంగానే తమ బిడ్డ మృతి చెందిందని తండ్రి శ్రీకాంత్‌రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అనంతరం శిశువు బంధువులు ఆసుపత్రి ఎదుట ఆందోళన చేపట్టారు. శిశువు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'పది'లో వందశాతం ఉత్తీర్ణత సాధించాలి



విద్యార్థులతో ఇన్‌చార్జ్ ఎంఈఓ శ్రీధర్, ఇన్‌చార్జ్ హెచ్‌ఎం అనంతయ్య

ఘట్‌కేసర్: పదో తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని ఇన్‌చార్జ్ మండల విద్యాధికారి శ్రీధర్ అన్నారు. సోమవారం అంకుషాపూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన విద్యార్థుల వీడ్కోలు సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పదిలో ఉత్తమ ఫలితాలు సాధించి పాఠశాల, ఉపాధ్యాయులు, తల్లితండ్రులకు మంచిపేరు తీసుకురావాలన్నారు. ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయులు అనంతయ్య మాట్లాడుతూ.. పదోతరగతి విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికి గురికాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలని సూచించారు. ఏపీపీసీ చైర్‌పర్సన్ పద్మ, ఆంజనేయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆస్తిపన్నుపై రాయితీని సద్వినియోగం చేసుకోవాలి

కుషాయిగూడ: ఆస్తిపన్ను చెల్లింపులో ప్రభుత్వం ఇచ్చే రాయితీని సద్వినియోగం చేసుకోవాలని చర్లపల్లి డివిజన్ కార్పొరేటర్ బొంతు శ్రీదేవి సూచించారు. సోమవారం ఆస్తిపన్ను విభాగం అధికారులతో ఆమె సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 2024–25 ఏడాదికి చెల్లించాల్సిన ఆస్తిపన్ను బకాయిల మొత్తాన్ని 10 శాతం వడ్డీతో ఏక కాలంలో చెల్లిస్తే 90 శాతం రాయితీని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ అవకాశాన్ని ఈనెల 31 వరకు చెల్లించినవారికే వర్తిస్తుందని వివరించారు. ఏఎంసీ నాగార్జున, ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్ సుధాకర్ తదితరులున్నారు.

'బీఆర్ఎస్ నేతలే తప్పుదోవ పట్టిస్తున్నారు'

అల్వాల్: మచ్చబొల్లారం డివిజన్ హిందూ శ్మశానవాటిక వద్ద డంపింగ్‌యార్డు విషయంలో బీఆర్ఎస్ నేతలు కాలనీవాసులను తప్పుదోవ పట్టిస్తున్నారని మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు ఆరోపించారు. సోమవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. డంపింగ్‌యార్డు విషయమై తాను జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్, అల్వాల్ డీసీ శ్రీనివాస్‌రెడ్డిలకు వివరించానన్నారు. పలువురు బీఆర్ఎస్ నాయకులు కాలనీవాసులను తప్పుదోవ పట్టించి ధర్నా చేయడం సరికాదన్నారు. బీఆర్ఎస్ నాయకులు ఇష్టమొచ్చినట్లు మాట్లాడితే కాంగ్రెస్ నాయకులు ఊరుకోబోరని హెచ్చరించారు.

తోటి కార్మికుడిని కత్తితో పొడిచి..

హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు

కీసర: క్షణికావేశంలో తోటి కార్మికుడిని హత్య చేసిన కేసులో నిందితుడికి మల్కాజిగిరి కోర్టు జీవిత ఖైదు శిక్ష విధించింది. కీసర ఇన్‌స్పెక్టర్ కె. శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. 2024లో గోధుమకుంట గ్రామంలోని సూర్ ఫీడ్ సెంటర్ కోళ్ల ఫారంలో పనిచేస్తున్న ఇద్దరు కార్మికుల మధ్య జరిగిన గొడవలో ఓ వ్యక్తి హత్యకు గురయ్యాడు. కోళ్ల పెంపకం కేంద్రంలో ఒడిశాకు చెందిన దినసరి కూలీ బబ్లూనాయక్ కబిచంద్రకు మధ్య గొడవ జరిగింది. పాత గొడవను మనసులో ఉంచుకున్న నిందితుడు కబిచంద్ర అదే రోజు సాయంత్రం బబ్లూనాయక్ ఇంటికెళ్లి గొడవకు దిగి చాకుతో బబ్లూనాయక్ కడుపులో పొడిచాడు. కత్తిపోటుకు గురైన అతడిని ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన కీసర పోలీసులు ఏడాదిలోనే నిందితుడికి శిక్షపడేలా చేశారు. ఈ కేసు దర్యాప్తుపై రాచకొండ సీపీ సుధీర్‌బాబు పోలీసులను అభినందించారు. ఆయన మాట్లాడుతూ.. ఎట్టి పరిస్థితుల్లో వ్యక్తులు తాత్కాలిక ఆవేశానికి లోనై చట్టాన్ని చేతుల్లోకి తీసుకోకూడదని సూచించారు.

PUBLIC NOTICE

General Public are hereby informed that on 14th March 2025, in the evening at about 5.30 pm Near Sree Bakery area, I lost my Cover Containing Sale Deed No. **1458/2000** dated 12-05-2000 registered at SRO Vallabh Nagar in Secunderabad and some other Papers. Founders are cautioned not to Mis-Use the said documents in any manners. Founders are also requested to contract the under signed for Suitable reward in the matter

G.S. MURTHY, Advocate
Door No. 1-9-69/3,
Temple Alwal, Secunderabad.
Cell : 9391000920

IN THE COURT OF THE HON'BLE XIV ADDL. CHIEF JUDGE, C.C.C., AT HYDERABAD
O.S.No. 98 OF 2025

Between:
P. Chandra Sekhar ...Plaintiff
AND
1. Y. Sudharani, D/o. Late P. Ramdas, W/o. Y. Sai Kumar, aged about 44 years, Occ: Household,
2. P. Prabha Rani, D/o. Late P. Ramdas, Aged about 43 years, Occ: Household, Both are R/o. Flat No.201, 2nd Floor, Plot No. 173/S, Meerpet Village, Saroornagar Mandal, Ranga Reddy- 500 058.
...Defendants No.1 & 2

To
ALL CONCERNED
...Defendants-3

Please take notice that the plaintiff has filed aforementioned suit against the defendants No.1, 2 &3 for declaration of ownership by virtue of schedule properties "A" and "B" i.e. (1). H.No.4-6-32/97/1 (old House No.6-30/1), admeasuring 211 Sq.yds., having plinth area of 516.68 Sq.fts., with RCC, situated at Baba Nagar, Nacharam Village, Uppal Mandal, Medchal-Malkajgiri Dist., and (2). H.No.1-9-295/27/3, consisting with Ground, First and Second Floors, admeasuring 144.2 Sq.yds., situated at Vidya Nagar, Hyderabad., by virtue of Will Deed, dt.04-10-2024, the said suit is posted to 17-04-2025 for your appearance and written statement. Wherein the concerned person shall be directed to appear before this Hon'ble Court either in person or through Counsel on 17-04-2025 at 10.30 A.M., in case of failing to appear on the said date and time before the Hon'ble Court, the matter will be heard and determined as per law.

(BY ORDER OF THE HON'BLE COURT)
M/s. SHANKAR AMSHALA,
A. BALA SWAMY, S. SRINIVAS
KYSARAM NIRANJAN, B.SANDHYA
ADVOCATES
101, Plot No. 122, Hima Keerthi Apartment, Kalyan Nagar-3, Motinagar, Hyderabad-500 018, Telangana State, Mobile : : 9346685942